నత్త నడకన పంట సంజీవని

- మందకొడిగా సాగుతున్న సేద్యపు నీటి కుంట పనులు
- 24 గ్రామాల్లో మంజూరైన కుంటలు 48, పూర్తయినవి 9
- నిర్లక్ష్యంలో అధికార యంత్రాంగం


గ్రామాల్లో జరుగుతున్న సేద్యపు నీటి కుంట పనులు

పొన్నూరు: రైతు పొలంలో నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పంట సంజీవని కార్యక్రమం ద్వారా చేపట్టిన సేద్యపు నీటి కుంట (ఫారం ఫాండ్) పనులు మండలంలో మందకొడిగా సాగుతున్నాయి. వర్షాలు పడకముందే కుంటల తవ్వకం పూర్తయ్యేలా రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ.. అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలోని 24 పంచాయతీలలో 128 నీటి కుంటలు ఏర్పాటు లక్ష్యం కాగా 48 మంజూరయ్యాయి. వాటిలో ప్రస్తుతం 15 మాత్రమే ప్రారంభించగా.. ఇప్పటికీ 9 మాత్రమే పూర్తిచేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే అనుకున్న లక్ష్యం ఈ నెలాఖరుకు పూర్తి చేయాల్సి ఉన్నా సంబంధిత అధికార యంత్రాంగం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

ప్రయోజనాలు ఇవీ..

నీటికుంటలో వర్షపు నీటిని ఒడిసి పడితే అవసరమైన సమయంలో మొక్కలు, పంటలకు నీటిని అందించవచ్చు. సాగుకు తోడు మూగజీవాలకు నీరు అందుబాటులో ఉంటుంది. గుంతలో చేరిన ఒండ్రుమట్టి ఎరువుగా వినియోగించుకోవచ్చు. ఈ నీటి ద్వారా కొంత భూమిలో ఆదాయాన్నిచ్చే కూరగాయలు పండించుకోవచ్చు. భూగర్భ జలాలు పెంచేందుకు, భూసారం పెంచేందుకు గాను నీటి కుంటలు దోహదపడతాయి. పంటలకు పట్టిన చీడపీడల నివారణ, అవసరమైన సస్య రక్షణ చర్యలకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

126 నుంచి 1104 వరకు పని దినాలు..

రైతు పొలంలో వర్షపు నీరు నిల్వ చేసుకునే విధంగా ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటల పనులు చేపడుతున్నారు. కొలతల ప్రకారం ఒక్కో కుంట నిర్మాణానికి 126, 339, 666, 1104 పని దినాలు కేటాయించారు. 2.83 సెంట్ల కుంటకు రూ.30,281లు.. 5.70 సెంట్ల కుంటకు రూ.70,521లు.. 8.03 సెంట్ల కుంటకు రూ.1.32 లక్షలు.. 15.20 సెంట్ల కుంటకు రూ.2,14,358లను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. భూమి గట్టిగా ఉండడం, మెట్ట ప్రాంతాల్లో కుంటల తవ్వకానికి తవ్వకం కష్టంగా మారిందని శ్రామికులు అంటున్నారు. కుంటల తవ్వే పనులకు వేతనాలు సకాలంలో ఇవ్వని కారణంగానే వేతనదారులు దూరంగా ఉండడం వల్లే లక్ష్యం నెరవేరడం లేదనేది యంత్రాంగం నివేదికలు చెబుతున్నాయి.

వేగవంతంగా చేయిస్తున్నాం..

మండలంలో 48 సేద్యపు నీటి కుంటలు మంజూరు కాగా, ఈ నెలాఖరుకు 15 నీటి కుంటలు పూర్తిచేస్తాం. ఉపాధి హామీ పథకంలో నీటి కుంటల తవ్వకానికి లక్ష్యం ప్రకారం పూర్తిచేయించేలా పనులు వేగవంతం చేయిస్తున్నాం. రైతులకు ప్రయోజనకరంగా మారే నీటికుంటలపై అందరికీ అవగాహన పెంచుతున్నాం. ప్రస్తుతం పొలాల్లో పంట సాగు అవుతున్న కారణంగా నీటి కుంటల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

– సుభాషిణి, ఉపాధి హామీ పథకం ఏపీఓ

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం



పెదకాకాని: పెదకాకాని వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుల ముఖ్య సమావేశం బుధవారం సాయంత్రం 6:30 గంటలకు నిర్వహించనున్నట్లు పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి నివాసంలో పెదకాకాని వైయస్సార్‌సీపీ గ్రామ కమిటీ నిర్వహణకు గ్రామ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి పెదకాకాని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొని గ్రామ కమిటీ నిర్వహణకు సహకరించాలని అంబటి మురళీకృష్ణ కోరారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పించాలి



గుంటూరు మెడికల్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని గుంటూరు జీజీహెచ్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ గత వారం రోజులుగా జీజీహెచ్‌లో యోగాంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్వచ్ఛంద సంస్థ ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులకు విద్యార్థులు, వైద్యులకు యోగా శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి యోగాపై అవగాహన పెంచేందుకు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలి

నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరా సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రవీంద్రకు ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఓరుగంటి నారాయణరెడ్డి, వల్లూరి సదాశివరావు విన్నవించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు పాటించాలని, రిజర్వాయర్లను సకాలంలో శుభ్రం చేయించాలని, పైపులైన్లు మరమ్మతులకు లోనైతే వెంటనే మరమ్మలులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. స్పందించిన మేయర్ రవీంద్ర, తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాగునీటి సరఫరాకి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తే వాటిని అమలు చేస్తామన్నారు.

దళితులను మోసం చేస్తున్న ప్రభుత్వం

నెహ్రూనగర్: ఎస్సీ కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించిన దళితులను మోసం చేస్తోందని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మంగళవారం గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌కు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు గత పాలనలో 2018–19 బడ్జెట్‌కి రూ.2,450 కోట్లు కేటాయిస్తే.. ఈసారి కేవలం రూ.341 కోట్లు కేటాయించి దళితులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకటించిన పథకాలు ఎస్సీల జీవన విధానం వారి ఉపాధికి ఎటువంటి సంబంధం లేని పథకాలని పేర్కొన్నారు. గతంలో భూమి కొనుగోలు పథకం, వ్యవసాయ పనిముట్లు, రూ.50 లక్షల వరకు బ్యాంక్, నాన్‌బ్యాంక్ లీంకేజీ స్కీమ్స్, చర్మ కారులకు రుణాలు, పూర్తి సబ్సిడీ రుణాలు, ఇలా ఎన్నో రకాలు పథకాలు ఉంటే ప్రస్తుతం ఈ సారి దళితులకు సంబంధం లేని పథకాలు తీసుకువచ్చి వారిని ముంచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.5వేల కోట్లతో బడ్జెట్‌ను ఎస్సీ కార్పొరేషన్‌కు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అమలు చేసిన 27 పథకాలను తిరిగి అమలు చేయాలన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

గుంటూరు రూరల్: మండల పరిధి జొన్నలగడ్డ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం, వేసవి సెలవుల కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీ రత్నంలు పాల్గొని కిషోర బాలికలకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. బాలికల చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ జి.కల్పనాకిరణ్, ఏఎన్ఎం ఆర్ ఇందిరా, సీహెచ్‌ఓ డి.జీవన్‌జ్యోతి ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: కిశోర బాలికలు బాల్య వివాహాలను వ్యతిరేకించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ విజయనిర్మల అన్నారు. కిశోరి వికాసం వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు ముస్లిం ఏరియా అంగన్‌వాడీ సెంటరు, గొట్టిపాడు డీడబ్ల్యూ–1, వంగిపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో విజయనిర్మల కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిర్మూలించి బాల్య వివాహ రహిత గ్రామాలుగా మనం తీర్చిదిద్దుకోవాలని అన్నారు. సూపర్‌వైజర్లు, ఎస్ భారతి, పి.మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లు నిర్మించాకే రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి


ఏటుకూరులో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణానికి ముందే డ్రెయిన్ల నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ ఏటుకూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించి.. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డ్రెయిన్లు నిర్మాణం చేయకుండా రోడ్లు ఏర్పాటు చేయడంతో వర్షాలకు రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు. తప్పనిసరిగా కాలువల నిర్మాణం అనంతరమే రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. ఏఈలు తమ పరిధిలో జరుగుతున్న పూడిక తీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని.. ఎక్కడైనా కాలువల్లో పూడిక తీతకు అడ్డుగా ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులతో సమన్వయం చేసుకొని తొలగించాలన్నారు. పర్యటనలో డీఈఈ సతీష్ కుమార్, ఎస్ఎస్ రాంబాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్లాది ప్రతిభా పాటవాలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న నరసింహదీక్షితులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి శత జయంతి సంస్మరణ సభ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి, మల్లాది చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. సభకు మల్లాది వేంకటరామనాథశర్మ అధ్యక్షత వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ దీవి నరసింహ దీక్షితులు, ప్రముఖ హరికథ భాగవతార్ ముప్పవరపు వెంకటసింహాచలశాస్త్రి, ఆధ్యాత్మిక ప్రవచకులు గుదిమెళ్ళ కూర్మనాథస్వామి, కప్పగంతు రామకృష్ణ ప్రసంగించారు. మల్లాది చన్ద్రశేఖరశాస్త్రి ప్రతిభా పాటవాలు, హరికథ కళాసమన్వయమని ప్రశంసించారు. పురాణం కాలక్షేపం కాదని సకల కళానిక్షేపమని పేర్కొన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు.

విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందాలి


మాట్లాడుతున్న నళినీకాంత్, ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు, తదితరులు

లక్ష్మీపురం: విద్యార్థులు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందాలని సీఐటీయూ నాయకుడు కె.నళినీకాంత్ పేర్కొన్నారు. నగరంలోని గుజ్జనగుండ్లలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానోత్సవ సభ సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు కంప్యూటర్ కోర్సుల్లో 45 రోజులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ముగింపు సందర్భంగా సర్టిఫికెట్ ప్రదానోత్సవ సభలో కె.నళినీకాంత్, ఆర్వీఆర్ అండ్ ఇంజినీరింగ్ కాలేజ్ మాజీ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎస్.భావన్నారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ట్రైనర్ కె.రమ్య, సీఐటీయూ నాయకులు షేక్ ఖాశింవలి, బి.సత్యనారాయణ, షేక్ బాషా, షేక్ ఖాశిం షహీద్, సచివాలయ సంఘం నాయకురాలు కె.అనూరాధ పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

తాడేపల్లి రూరల్: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలో బుధవానం నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలోని కేబీ భవన్‌లో కౌలు, రైతు సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ప్రతి రైతు ఖాతాలో జమ చేస్తామని కూటమి నాయకులు చెప్పారని.. అధికారం చేపట్టి ఏడాది అయినా ఎవరికీ పథకం అమలుకాలేదని విమర్శించారు. మంగళగిరిలోని సీసీఎల్ కార్యాలయం వద్ద కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిర్వహించే ధర్నాలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాను వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దానం వినోద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వినోద్‌ను నూరిఫాతిమా దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

ఉచిత విద్య ప్రవేశాలు కల్పించాలి


ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాహక్కు చట్టం ద్వారా ఉచిత విద్య ప్రవేశాలను నిరాకరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏపీ సిటిజన్స్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది షేక్ జిలానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని గుంటూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ విద్యాహక్కుచట్టం ద్వారా గుంటూరు నగరంలో 700 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశం పొందేందుకు అర్హత పొందారని, ప్రవేశాలకు మంగళవారం చివరి రోజు కావడంతో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లిన తల్లిదండ్రులతో పాఠశాలల ప్రతినిధులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అదే విధంగా ఉచిత విద్య ప్రవేశాలు ఇవ్వబోమని నిరాకరించారని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో లాలూచీ పడి విద్యాహక్కుచట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, దీనిపై తాము న్యాయ పోరాటానికి దిగుతామని స్పష్టం చేశారు. నిరసన ప్రదర్శనలో న్యాయవాదులు పాలపాటి అనిల్‌కుమార్, నూనె పవన్‌తేజ, బత్రాజు సందీప్, సత్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ 25 (ఏ) గుంటూరు ఆంధ్ర బెటాలియన్ నిర్వహించిన 'సీ' సర్టిఫికెట్ పరీక్షల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. మంగళవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎన్‌సీసీ అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ పరీక్షలకు తమ కళాశాల నుంచి హాజరైన 12 మంది విద్యార్థులందరూ ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఓఎస్డీ డాక్టర్ పి.సీతారామయ్య, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సీహెచ్ అజిత్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

ప్రత్తిపాడులో విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు


వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈలు

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ పి.సుబ్రమణ్యం అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని ఈదులపాలెం, గింజుపల్లివారిపాలెం, గనికపూడి, కొత్తమల్లాయపాలెం, కొండేపాడు, మేడావారిపాలెం, నన్నపనేనివారిపాలెం, తిమ్మాపురం, తుమ్మలపాలెం, నిమ్మగడ్డవారిపాలెం, వంగిపురం, యనమదల గ్రామాల్లో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుబ్రమణ్యం నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో 36 మంది అధికారులు, 135 మంది సిబ్బంది, 36 బృందాలుగా ఏర్పడి 2,203 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషనులో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ తనిఖీల వివరాలను వెల్లడించారు. మీటరు ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మందికి రూ.2.75 లక్షలు.. అనుమతించిన కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ.5 వేలు.. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 82 మందికి రూ.4.22 లక్షలు.. వినియోగం కంటే బిల్లు తక్కువగా వచ్చిన ఒకరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.7.07 లక్షల అపరాధ రుసుములు విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన పూర్తి వివరాలను 94408 12263, 94408 12361 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఈఈలు సీహెచ్. వెంకటేశ్వరరావు, వై.ఏడుకొండలు, డీఈఈలు ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, ఎ.గురునాథరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, టి.గౌతం, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ సీఐఎస్‌సీఈ జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం


విజేతలతో పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండల పరిధి నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో మంగళవారం ఏపీ సీఐఎస్‌సీఈ జోనల్ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ క్రీడల్లో అండర్–14 లెవల్‌లో లయోలా పబ్లిక్ స్కూల్ నల్లపాడు, లిటిల్ ఫ్లవర్‌స్కూల్ గుంటూరు, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ కడప నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–17 విభాగంలో లయోలా నల్లపాడు, స్టెమ్‌స్కూల్ గుంటూరు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంథోనికి పాఠశాల పీడీ పట్టేటి బాపూజీ క్రీడాకారులను పరిచయం చేశారు. క్రీడాకారులను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ నగయరాజ్‌మార్క్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌లు జెండాలను ఊపి క్రీడలను ప్రాంభించారు. పోటీలలో అండర్–14 విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కడప ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్–17 విభాగంలో లయోలా పబ్లిక్ స్కూల్ నల్లపాడు విజేతలుగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో అండర్–14లో లయోలా పబ్లిక్ స్కూల్ జట్టు, అండర్–17లో లిటిల్ ఫ్లవర్ స్కూల్ నిలిచాయి. తృతీయ స్థానంలో అండర్–14 విభాగంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, అండర్–17 విభాగంలో స్టెమ్‌స్కూల్‌లు నిలిచాయి. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

కళాకారులను ప్రోత్సహించాలి


'పకీరు సంగు' నాటకంలో సన్నివేశం

పెదకాకాని: కళలను ఆదరించి కళాకారులను పోత్సహించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని గంగోత్రి వ్యవస్థాపకుడు, నాటక, సినీనటుడు నాయుడు గోపి అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని పేరంటాళ్ల అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం రాత్రి పకీరు సంగు, శ్రీ సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి వారి సౌజన్యంతో శ్రీతారకరామ కళాప్రవంతి పెదకాకాని వారి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనల సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నాయుడు గోపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఒత్తిడి జీవనంలో ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం నింపేందుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ అంతరించిపోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమానికి కందిపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం ప్రదర్శించిన పకీరు సంగు, శ్రీ సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు కళాకారులను ఉర్రూతలూగించాయి. అనంతరం పలువురు స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించారు.

జీడీసీసీ బ్యాంకు స్కాంలో నిందితులపై చర్య తీసుకోవాలి


దీక్షలో మాట్లాడుతున్న అఖిల భారత కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు

లక్ష్మీపురం: జీడీసీసీ బ్యాంకులో చోటుచేసుకున్న స్కాంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ''సత్యమేవ జయతే'' పేరుతో దీక్ష నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్ కుమార్ పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా అఖిల భారత కో–ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు కె.వి.ఎస్. రవి కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నకిలీ రెవెన్యూ రికార్డు, ఆధార్, పాన్ కార్డులు సృష్టించి అక్రమంగా రుణాలు పొందిన వారి నుంచి మొత్తాన్ని వసూలు చేస్తూ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ స్కాంతో సంబంధం లేని బ్యాంక్ ఉద్యోగులను బాధ్యులను చేస్తూ వారిపై క్రిమినల్, సివిల్ చర్యలకు దిగటం దురదృష్టకరమని చెప్పారు. బ్యాంకు ఉద్యోగులపై చర్యలు నిలుపుదల చేయకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడారు.

వైభవంగా వేంకటేశుని రథోత్సవం


గరుడ వాహనంపై స్వామి వారు

నగరంపాలెం: స్థానిక లాలాపేట పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తోన్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం కొనసాగాయి. స్వామికి చందనం అలంకారం చేశారు. స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 108 కలశాలతో అష్టోత్తర సప్నన అభిషేకాలు జరిగాయి. అనంతరం జిన్నాటవర్ కూడలి మీదగా కృష్ణ మహల్‌రోడ్, నాజ్ సెంటర్, గుంటగ్రౌండ్‌రోడ్, భగత్ సింగ్ సెంటర్, విజయ టాకీస్ రోడ్డు మీదగా దేవస్థానం వరకు రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమాలను దేవస్థాన ఈఓ టి.సుభద్ర పర్యవేక్షించారు.